
ప్రజాశక్తి
గురువారం 22 ఆగస్టు 2024



గురుకుల పాఠశాలకు రాష్ట్ర స్థాయి అవార్డు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సంధర్భంగా ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ వివి రమణను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక అవ్వడం పట్ల ఆయన పాఠశాల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిడి అన్నదొర, ప్రిన్సిపల్ అరుణ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని చిన్న పిల్లల విభాగం, మెటర్నటీ, లేబర్ వార్డు, ఎస్.ఎన్.సి. యు, డయాలసిస్, ఒపి విభాగాలను నిశితంగా పరిశీలించారు. ప్రసూతి విభాగంలో బాలింతలతో మాట్లాడారు. సమయానికి సక్రమంగా భోజనం అందిస్తున్నది లేనిది, అందుతున్న వైద్యం, పర్యవేక్షణ తదితర అంశాలను ప్రశ్నించి ఆరా తీశారు. రెండు పూటలా వైద్యులు పరీక్షిస్తున్నారని కలెక్టర్‌కు తెలపడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. చిన్న పిల్లల విభాగంలో జ్వరాలతో ఆసుపత్రిలో చేరిన చిన్నారులను పరిశీలించారు. కేష్ షీట్‌ను పరిశీలించి మలేరియా జ్వరం ట్రీట్మెంట్, రక్త పరీక్షల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రంలోని చికిత్స పొందుతున్న రోగుల వివరాలను రిజిస్టర్ లో పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రి భవనంలో వర్షాలకు చెమ్మ రావడాన్ని గుర్తించి వెంటనే మరమత్తులు జరిపించాలని ఎపిఎంఎస్ ఐడిఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. పడకల మీద బెడ్ షీట్లు ఎప్పటికప్పుడు మార్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమయపాలన పాటించి రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. అనంతరం ఒపి విభాగం లోని రోగుల వివరాలను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి, వైద్య శాఖ అధికారులు డాక్టర్ ఎం వినోద్, ఏపీఎంఎస్ ఐడీఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.ఎన్.ప్రసాద్, డిఇ బి.ప్రసన్న కుమార్, అర్ఎంఒ శ్యామల, నర్సింగ్ సూపరెండెంట్ డి.కరుణ శ్రీ, వైద్యులు వెంకటరావు, శేష గిరి, కమల్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పిల్లల విభాగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రేపు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జిల్లాకు రాక

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈనెల 23న జిల్లా పర్యటనకు వస్తున్నారని జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న ఉదయం 9.40 గంటలకు జిల్లాకు మంత్రి చేరుకుంటారని, ఉదయం 10 గంటలకు బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తారని ఆయన చెప్పారు. 11 గంటలకు జిల్లా ఆసుపత్రి సందర్శన, అనంతరం వైద్య ఆరోగ్య శాఖ సమీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు విశాఖపట్నం వెళతారని ఆయన పేర్కొన్నారు.

23న జిల్లాలో గ్రామ సభలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 23న గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభ నిర్వహణకు గాను ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలలో ఈ నెల 23న గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను, వాటి వివరాలను పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామ పంచాయితీ గ్రామసభ, వార్డు సభల సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. గ్రామసభల్లో పలు పథకాలకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు, పనులకు ప్రతిపాదనలు స్వీకరించడం జరుగుతుందన్నారు. గ్రామ సభల నిర్వహణలో భాగంగా ఉపాధి హామీ చట్టం ద్వారా వేతనాలు పొందేవారి హక్కులు, అర్హతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని, ఇప్పటికే మంజూరు చేసిన, పురోగతిలో ఉన్న పనులను గ్రామ సభల్లో చదివి ప్రజలకు వివరిస్తామని తెలిపారు. 2024-25 సంబంధించి కొత్త పనులు గుర్తించి వాటి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరుగుతుందని, సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలు చేపడతామని కలెక్టరు తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ, చిన్నారులు, మహిళల రక్షణ పైన, రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మన్యం జిల్లా ఎస్‌డిపిఒ అంకిత సూరానా అన్నారు. బుధవారం జిల్లా ఎస్‌డిపిఒగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె పట్టణ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆమెకు పట్టణ ఎస్ఐలు సంతోష కుమారి, రవీంద్రరాజు పుష్పగుచ్ఛాలను అందించి సాదరంగా ఆహ్వానించారు. పోలీస్ స్టేషన్‌లోని పరిసర ప్రాంతాలను, రికార్డులను, ఇటీవల వచ్చిన కేసుల వివరాలను అడిగి, పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తనది ఐపిఎస్ 2021 బ్యాచ్ అని, తొలుత విశాఖ గ్రేహౌండ్స్‌లో కమాండర్‌గా విధులు నిర్వహించానన్నారు. ప్రభుత్వ, పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలను మేరకు జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు నిఘా పెట్టామన్నారు. జిల్లాకు ఒడిస్సా సరిహద్దుగా ఉండడం వల్ల పక్క రాష్ట్రం నుండి గంజాయి రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. దీంతో పాటు, నాటు సారా రవాణా, తయారీ, కొనుగోలు, అమ్మకాలపై ఉక్కు పాదం మోపనున్నట్లు తెలిపారు. గంజాయితో పట్టుబడితే చర్యలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మూలాల వరకు వెళ్లి సంబంధిత వ్యక్తులపై విచారణ చేపడతామని హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి, నేరాలు తగ్గేలా చర్యలు చేపడతామని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడకుండా, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేరాలు తగ్గేలా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని ఆమె చెప్పారు. ఇదిలా ఉండగా పార్వతీపురం ఎస్డీపీవోగా అంకిత సురానా బాధ్యతలు చేపట్టిన గంటల వ్యవధిలోనే పట్టణ పోలీస్ స్టేషన్ సందర్శించడం మంచి పరిణామం పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



టూటౌన్ పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్‌డిపిఒ అంకిత సూరానా

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌డిపిఒ

పార్వతీపురం రూరల్ :పార్వతీపురం మన్యం జిల్లా అసిస్టెంట్ ఎస్‌పిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన సురానా అంకిత మహవీర్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలతో పాటుగా అభినందనలు తెలియజేస్తూ విధి నిర్వహణలో తనదైన శైలిలో జిల్లాకు సేవలందించి తద్వారా ప్రజల మన్ననలు పొందాలని కోరారు.

గిరిజనులకు తప్పని డోలి మోత

గర్భిణిని మైదాన ప్రాంతానికి తరలింపు

ప్రజాశక్తి కొమరాడ

రాష్ట్రంలోనే వెనుకబడిన నియోజకవర్గంగా కురుపాం పేరుగాంచిన విషయం తెలిసిందే. సంక్షేమ పథకాలు అందించకపోయినా కనీస సౌకర్యాలైన రోడ్లు, మంచినీరు, విద్య, వైద్యం అందిస్తే చాలా వరకు అభివృద్ధి చెందుతామని ఆశపడ్డ గిరిజనులకు నిరాశే మిగులుతుందని చెప్పొచ్చు. మండలంలోని కనీసం రహదారి సదుపాయాల్లేని అనేక గిరిజన గ్రామాలు ఉండడంతో ప్రజలకు అత్యవసర సేవల సైతం అందని పరిస్థితి ఉంది. ఏ చిన్న కష్టం వచ్చినా అందులోనూ వర్షాకాలంలో వారి కష్టాలు వర్ణాతీతమని చెప్పొచ్చు. గర్భిణీలను అయితే అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి తరలించాలంటే రహదారి లేక వారు నడవలేని పరిస్థితుల్లో మంచాలు కట్టుకొని డోలీ రూపంలో కిందకు దించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి ఘటన కొమరాడ మండలంలో బుధవారం చోటుచేసుకుంది.



గర్భిణిని డోలిపై తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు

మండలంలోని గాజులుగూడకు చెందిన 9 నెలల గర్భిణీ హిమరిక రజినికి నొప్పులు రావడంతో వైద్య శాఖ అధికారులకు సమాచారం ఇచ్చేందుకు కూడా అవకాశం లేకపోయింది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో బుధవారం ఉదయం మంచాన్ని డోలిగా మార్చుకొని కెమిశెల తీసుకురావాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. నాగావళి నది ఆవల ఉన్న గాజులగూడ నుండి కెమిశీల వరకు రెండు కిలోమీటర్లు మైదాన ప్రాంతమైనప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, ఉన్న రహదారి కూడా బురద కావడంతో నడిచి వెళ్లడానికి వీలు లేని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో గాజులగూడ నుంచి రజినికి డోలీతో కట్టి మూసుకొని కుటుంబ సభ్యులు, కమ్యూనిటీ హెల్త్ వర్కరు, ఆశా కార్యకర్తలు తీసుకొని కురుపాం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇలా మండలంతో పాటు నియోజకవర్గంలో అనేక గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు లేకపోవడంతో వారు అత్యవసర పరిస్థితుల్లో డోలిమోతలే వారికి శరణ్యం తప్ప మరో మార్గం లేకపోయింది. కొన్ని సమయాల్లో దారిలోనే గర్భిణీలు ప్రసవించడంతోపాటు అదే సమయాల్లో మృత్యువాత పడిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. గర్భిణీలు కాకుండా ఇతర అనారోగ్యాల బారిన పడితే అత్యవసర సేవలు సకాలంలో అందకపోవడంతో అనేకమంది మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజన గ్రామాల్లో కనీస వసతులు కల్పించాలని కోరారు.

డోలీమోతల సిగ్గు సిగ్గు.. సిపిఎం

దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలైనా గిరిజన ప్రాంతాల్లో డోలిమోతలు తప్పకపోవడం సిగ్గుచేటని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో జరిగిన డోలీమోతపై ఆయన స్పందించారు. పాలకులు గిరిజనుల నుండి ఓట్లు దోచుకోవడమే తప్ప వారికి కనీస సౌకర్యాలకల్పనలో చిత్తశుద్ధి లేదని చెప్పడం ఇంతకన్నా నిదర్శనం ఏమిటి అని అన్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు, పాలకులు, అధికారులు స్పందించి గిరిజన పంచాయితీలకు రోడ్డు మార్గం కల్పించాలని గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

వైద్య విద్యార్థిని మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన ర్యాలీ, మానవహారాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిమృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక సుందరయ్య భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్‌టిసి కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, శ్రామిక మహిళ జిల్లా నాయకులు వాకాడ ఇందిర, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ, నాయకులు కొల్లి సాంబమూర్తి, సూరిబాబు, అంగన్వాడీ యూనియన్ నాయకులు మల్లేశ్వరి, రాజేశ్వరి, గౌరి, మణి, విజయలక్ష్మి, ఆశా వర్కర్లు యూనియన్ నాయకులు రాజేశ్వరి మాట్లాడారు. కోల్‌కత్తాలో ఈనెల 9న మెడికల్ కాలేజీలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచారానికి నిరసనగా ఈరోజు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రజలు, మేధావులు, లాయర్లు, వైద్యులు, సిబ్బందితో పాటు ప్రజాసంఘాల నాయకులు, వివిధ కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు నిరసనలు అగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. వైద్యరాలు చనిపోయి నేటికీ 11 రోజులైనా హత్యాచారం నిందితులను గుర్తించి శిక్షించడంలో అక్కడున్న రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ సిబ్బంది పూర్తిగా నీరు కారిచే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఎంతో మంది ప్రాణాలు కాపాడే వైద్యులకే ఇలా జరిగితే సామాన్యుల భవిష్యత్తుకు ఏం రక్షణ ఉంటుందన్నారు. యువ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులకు కఠినంగా శిక్షపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంకా ఈ పోరాటం ఉధృతం కాకముందే ఎవరైతే ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కేడి నాయుడు, ఎస్ఎఫ్ఐ నాయకులు పండు, డేవిడ్, అంగన్వాడీ హెల్పర్ అండ్ టీచర్లు పాల్గొన్నారు.

సాలూరు : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ హత్యాచారానికి నిరసనగా పట్టణంలో సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన కార్మికులు మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోసు బొమ్మ జంక్షన్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు జూనియర్ డాక్టర్‌ను హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, మహిళల రక్షణకు మరిన్ని కఠిన చట్టాలు రావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.రాముడు, శంకరరావు,ఐద్వా నాయకులు బంగారమ్మ, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురం పట్టణంలో ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సీతానగరం: ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కాలేజీ నుంచి మెయిన్ రోడ్ ఆటో జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.డేవిడ్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.పండు మాట్లాడుతూ మహిళలకు, డాక్టర్లకు పటిష్టమైన భద్రత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు కల్పించిన రక్షణ చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని, హత్యాచారానికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హరీష్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరాడ : వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా సిఐటియు నాయకులు కొల్లి సాంబమూరి ఆధ్వర్యాన స్థానిక జూనియర్ కళాశాల జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు మానవహారం చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాలూరు ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

డిఎస్‌సి శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

పార్వతీపురంరూరల్ : స్థానిక ఐటిడిఎ పరిధిలో గిరిజన అభ్యర్థులకు డిఎస్‌సి కోచింగ్ ఇచ్చేందుకు నిర్ణయించినట్టు ఐటిడిఎ ఇన్‌ఛార్జ్ పిఒ ఎస్ఎస్ శోబిక బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిఎస్‌సి కోచింగ్ ఇచ్చుటలో అనుభవం, ఎక్కువ ఉతీర్ణత శాతం కలిగిన సంస్థలు, వ్యక్తుల నుండి దరఖాస్తులు కోరుచున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు గాని, సంస్థలు స్టడీ మెటీరియల్‌తో సహా పూర్తి వివరాలతో దరఖాస్తులను పార్వతీపురం ఐటీడీఏ పిఎంఆర్‌సికి ఈనెల 27న సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని ఆమె వివరించారు. వివరాలకు సెల్ ఫోన్ నెంబర్లు - 9441606731, 7013196555 సంప్రదించవచ్చని సూచించారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్ జి టి విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం వైటిసిలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు. అభ్యర్థుల ఎంపిక పూర్తయిందని, శిక్షణ త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చేందుకు ఉత్తమమైన శిక్షకులను ఎంపిక చేసేందుకు ప్రక్రియ వేగవంతం చేశామని, అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తామని అన్నారు. శిక్షణ రెండున్నర నెలలు నుండి 3 నెలలు ఉంటుందని ఆమె వివరించారు.

గిరిజన గ్రామాల్లో గజరాజులు తిష్ట

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జరడ పంచాయతీ పట్టాయిగెడ్డ గిరిజనలో గజరాజులు తిష్ట వేయడంతో గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజలు మాట్లాడుతూ సీతంపేట పరిసర ప్రాంతాల నుంచి నెల రోజుల కిందట వచ్చిన నాలుగు ఏనుగులు ఇప్పటికే జొన్న, రాగి, అరటి పంటలను, ఒక గిరిజనుడు ఇళ్లను పూర్తిగా ధ్వంసం చేశాయని భయభ్రాంతులకు గురై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జనావాసాలకు దూరంగా ఏనుగులను తరలించి పంటలతో పాటు తమ ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

ప్రయాణం దూరం... ఛార్జీల భారం

- సాలూరు - మక్కువ రహదారిలో నడవని బస్సులు
- శంబర గుండా ప్రయాణం
- అధ్వాన్న రహదారులతో ప్రజలకు తిప్పలు

ప్రజాశక్తి - మక్కువ

మండలం నుండి సాలూరు ప్రయాణించాలంటే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మక్కువ - సాలూరు రహదారి పూర్తిగా అధ్వాన స్థితిలో చేరుకోవడంతో ఆర్టీసీ బస్సులు ఈ రహదారి గుండా సర్వీసులను నడపడంలేదు. తరుచూ బస్సులు మరమ్మతులకు గురికావడం, అప్పుడప్పుడు రహదారి మధ్యలో కూరుకుపోవడంతో ఆర్టీసీ అధికారులు ఈ రహదారిలో బస్సు సర్వీసులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు సాలూరు నుంచి వయా మామిడిపల్లి, శంబర మీదుగా మక్కువ మండలానికి ఆర్టీసీ బస్సులను అధికారులు నడిపిస్తున్నారు. గతంలో సుమారు 19 కిలోమీటర్ల దూరంలో బస్సు ప్రయాణం, ప్రస్తుతం సుమారు 26 కిలోమీటర్ల మేర పెరిగే పరిస్థితి నెలకొంది. ఈ రూటు బాగున్నప్పటికీ ప్రజలపై ఆర్థిక భారం తప్పడం లేదు, సాలూరు నుంచి దుగ్గేరుకు రూ.40 టిక్కెట్టు ఉండేది. ఇప్పుడు రూటు పెరగడంతో రూ.50కు పెరిగిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సాలూరు నుంచి ఎర్రసామంతవలసకు రూ.30కు ఉండగా, ప్రస్తుతం రూ.45కు చేరుకోవడంతో ఈ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్ భారం పెరిగినయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సిన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఇలా ఉండగా సాలూరు- మక్కువ రహదారి గుండా బస్సులు రాకపోకలు నిలిచిపోవడంతో ఈ మార్గంలో ఉండే చప్పబుచ్చంపేట పంచాయతీ పరిధిలో గల పాయికపాడు, గోనికొండవలస, చప్పబుచ్చంపేట, మూకవలస తదితర గ్రామాల ప్రజలు నేరుగా మక్కువ వచ్చి సాలూరు వెళ్లాల్సి వస్తోంది. లేకుంటే ఆటోలను ఆశ్రయించాల్సిందే. అలాగే సాలూరు మండల పరిధిలోని గిరిజన గ్రామస్తులు కూడా ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఆర్టీసీ డ్రైవర్లకు కూడా అవస్థలు తప్పడం లేదు. శంబర నుంచి వచ్చే బస్సులను తిప్పేందుకు మక్కువలో స్థలం లేక మళ్లీ దూర ప్రాంతానికి వెనక్కు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది



గొయ్యిలో దిగబడ్డ లారీ (ఫైల్)

గోతులు ఎప్పుడు పూడుస్తారో?

సాలూరు - మక్కువ రహదారిలో పలుచోట్ల భారీ గోతులు ఏర్పడడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిచిపోయిన విషయాన్ని ఇటీవల మండల సమావేశానికి హాజరైన మంత్రి సంధ్యారాణి దృష్టికి స్థానిక ప్రజాప్రతిని తీసుకువెళ్లారు. అయితే అదే సమావేశంలో ఆర్ అండ్ బి అధికారులను తాత్కాలికంగానైనా గోతులను పూడ్చాలని, రహదారుల నిధులు మంజూరైనప్పుడు వాటిలో అడ్జస్ట్ చేసుకోమని అధికారులకు ఆదేశించారు. అయినా గోతులు ఇప్పటికీ పూడ్చిన దాఖలాలు కనిపించలేదు. ఇప్పటికైనా అధికారులు గోతులను పూడ్చి ఈ రహదారిలో బస్సులు నడిచేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అవకతవకలు సరిదిద్దకపోతే ఆందోళన : యుటిఎఫ్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

నిబంధనలకు విరుద్ధంగా జరిగిన పని సర్దుబాటును రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ యూనియన్లతో చర్చించిన అంశాలను కింది స్థాయి అధికారులు పట్టించుకోవడంలేదని, నిజమైన అప్పీలను తిరస్కరిస్తున్నారని అన్నారు. అప్పీళ్లలోని వాస్తవాలను తెలుసుకొని పరిష్కరించిన తర్వాతే పని సర్దుబాటు చేస్తానని చెప్పి, టెక్నికల్ సమస్యలతో తమకు సంబంధం లేదని కొంతమంది మండల విద్యాధికారులు దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా డిఇఒ ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి న్యాయమైన సమస్యలను పరిష్కరించిన తరువాతే కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని ప్రకటనలో తెలిపారు.

జిల్లా ప్రోగ్రాం అధికారిగా లక్ష్మీకాంత్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో చేపట్టిన వివిధ ప్రత్యేక కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించామని జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పిఎంయు)ను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. పిఎంయు జిల్లాలో చేపట్టిన రక్తహీనత కార్యాచరణ కమిటీ, మై స్కూల్ మై ప్రైడ్ తదితర కార్యక్రమాలను సమన్వయం చేస్తూ పర్యవేక్షణ చేస్తుందన్నారు. పిఎంయుకు జిల్లా స్థాయి ప్రోగ్రాం అధికారిగా పాచిపెంట ఎంపిడిఒ పున్నప లక్ష్మీకాంత్‌ను నియమించినట్లు ఆయన చెప్పారు. సంబంధిత కార్యక్రమాల అమలు, నివేదికల సేకరణ, విశ్లేషణ తదితర అంశాలను పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు.



అసెస్‌మెంట్ ట్యాబ్ ఎగ్జామ్స్‌ను పరిశీలిస్తున్న డిఇఒ పగడాలమ్మ

పరీక్షాలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి - భామిని

స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఐసిఎస్ఇ అస్సెస్మెంట్ ట్యాబు ఎగ్జామ్స్‌ను డిఇఒ జి.పగడాలమ్మ బుధవారం పరిశీలించారు. ఈ ట్యాబు ఎగ్జామ్స్‌కు ఆదర్శ పాఠశాల నుంచి 95మంది, కెజిబివి నుండి 40 మంది, అంబేద్కర్ గురుకులం నుండి 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఐసిఎస్ఇ ట్యాబు ఎగ్జామ్స్ పరీక్షలు ఈనెల 24 వరకు జరుగుతాయని డిఇఒ తెలిపారు. ట్యాబు ఎగ్జామ్స్‌పై సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ వి.భాస్కరరావు ఉన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా సవరపు రామారావు

ప్రజాశక్తి - సీతానగరం



ఎపి ఎస్‌సి, ఎస్‌టి హక్కుల పరిరక్షణ మండలి గౌరవాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల మంగళగిరిలో జరిగిన మండలి సమావేశంలో రామారావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు ఉత్తర్వులు జారీ చేశారు. రామరావు ఈ పదవిలో రెండేళ్ల పాటు ఉంటారు. ఈ మేరకు రామారావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అందజేసేలా కృషిచేస్తానని తెలిపారు.

పేదలకు నిత్యవసరాలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్, వృద్ధమిత్ర కో-ఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి బుధవారం తన సొంత నిధులతో నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రమ పొందుతున్న వారికి బియ్యం, సబ్బులు, స్టీల్ గ్లాసులు అందజేశారు. వీటిని ఐఆర్‌పిడబ్ల్యుఎ డైరెక్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులకు కొన్నేళ్లుగా వంటలు వండి సేవలందిస్తున్న బొత్స రాంబాబుకు దుశ్శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది జానీ, సత్యనారాయణ, గణేష్ పాల్గొన్నారు.



గిరిజన యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎస్ఐ జగదీష్‌నాయుడు

క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎస్సై ఎం.జగదీష్ నాయుడు తన సిబ్బందితో కలిసి కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా మండలంలోని మండ, జక్కరవలస, ఉప్పరజమ్మి, కొత్తపనుకువలస, సీతంపేట తదితర గ్రామాల్లో ఆసక్తి ఉన్న క్రీడాకారులకు వాలీబాల్ కిట్లను, టీషర్ట్, లోయర్‌ను అందజేశారు. క్రీడల్లోని మెళుకువలను తెలుసుకుని యువత ముందడుగు వేయాలని వారిలో క్రీడా స్ఫూర్తిని నింపారు. క్రీడల్లో గిరిజన యువత జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కొన్ని మెలకువలు నేర్పించారు, చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు శరీరం ఫిట్నెస్‌గా ఉంటుందన్నారు, కార్యక్రమంలో రైటర్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గురుపూజోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్స్- 2024 సంబంధించి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తెలిపారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సెప్టెంబర్ 05 గురుపూజోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్స్- 2024 సంబంధించి జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాలలు / జిల్లాపరిషత్ పాఠశాలలు/ ఎయిడెడ్ పాఠశాలలు/ మునిసిపాలిటీ పాఠశాలలు/ ఐటి డిఏ/ ఎపిఆర్ ఐ ఎస్ /ఏ పి ఎస్ డబ్ల్యు ఆర్ ఐ ఎస్/ ఎపిటిడబ్ల్యుఆర్ఐఎస్/ నందు పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకోబోయే ఉపాధ్యాయ/ ప్రధానోపాధ్యాయుల వారి సర్వీసు 15 ఏళ్లు నిండి, వారిపై ఎటువంటి క్రమశిక్షణా చర్యలు లేని ఉపాధ్యాయులు మాత్రమే అర్హులన్నారు. కావున ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులంతా సంబధిత మండల విద్యాశాఖాధికారి/ ఉప విద్యాశాఖాధికారి వారి ద్వారా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్స్-2024 నకు ఈనెల 21 నుంచి 27వరకు దరఖాస్తులు జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయము నందు సమర్పించాలని తెలిపారు. చవలసినదిగా తెలియజేసారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

పార్వతీపురం ఐటిడిఎ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు అధికారుల ఫోర్జరీ సంతకాలతో గిరిజన నిధులను దుర్వినియోగానికి పాల్పడిన అధికారులపై సస్పెండ్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం కురుపాంలో విలేకర్లతో ఆయను మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తే పనులు పూర్తికాకుండా ఇలా ఫోర్జరీ సంతకాలు పెట్టి గుత్తేదారులకు బిల్లులు చేయడం దారుణమన్నారు.

అంతర్జాతీయ కోచ్‌గా వరప్రసాద్

ప్రజాశక్తి - సాలూరు



మండలంలోని మామిడిపల్లికి చెందిన కనకల వరప్రసాద్ అంతర్జాతీయ కోచ్‌గా ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి చైనాలో జరగనున్న అండర్ 15,17 బాలబాలికల బ్యాడ్మింటన్ జుట్టుకు వరప్రసాద్ కోచ్‌గా వ్యవహరిస్తారు. 2006లో మామిడిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయునిగా పని చేసిన శ్రీరాములు వద్ద వరప్రసాద్ బ్యాడ్మింటన్‌లో ఓనమాలు నేర్చుకుని ఈరోజు అంతర్జాతీయ కోచ్ స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం భువనేశ్వర్‌లో కోచ్ దిలీప్ వద్ద మెళకువలు నేర్చుకున్న వరప్రసాద్ అస్సాం బాడ్మింటన్ స్టేడియంలో కోచ్‌గా సేవలందిస్తున్నారు. గతంలో అయన రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగిన పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. వరప్రసాద్ అంతర్జాతీయ కోచ్‌గా ఎంపికవడంపై తొలి గురువు శ్రీరాములు హర్షం వ్యక్తం చేశారు.

లయన్స్ క్లబ్ బస్ షెల్టర్ ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు సహకారంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ వి.గణేశ్వరరావు ప్రారంభించారు. బస్ షెల్టర్ నిర్మాణానికి జర్జాపు సూరిబాబు లక్ష రూపాయల విరాళం అందించారు. గతంలో 1973లో సూరిబాబు తండ్రి లయన్ జర్జాపు నీలకంఠం బస్ షెల్టర్‌ను నిర్మించారు. అది ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నందున మళ్ళీ పునర్నిర్మించడానికి సూరిబాబు సహకరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఇందుపూరి నారాయణ రావు, సభ్యులు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు పాల్గొన్నారు.

కందిసాగు ఎంతో మేలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

పొలాల గట్లపై కంది సాగు ఎంతో మలేని, దీనివల్ల పైరుకు రక్షణ పంటగానూ, రైతుకు అదనంగా రాబడి వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని సంతోషపురంలో పొలంబడి (మంచి మెలైన వ్యవసాయ పద్ధతులు) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర పంటల యాజమాన్యం, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి తద్వారా సాగు ఖర్చు తగ్గించడం, పంట దిగుబడులు, స్థలవరించుట, పర్యావరణ పరిరక్షణ పొలంబడి ఉద్దేశమన్నారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ఆచరించి సాగు ఖర్చు తగ్గించడమే కాక, పంటల ఉత్పత్తులను పెంచడమే రైతులకు మంచి మద్ధతు ధర రావడం జరుగుందని తెలిపారు. అలాగే ఖరీఫ్‌లో వరి పంటకు ఆశించే తెగుళ్లను క్రమం తప్పకుండా రైతులు పరిపాలించాలని కోరారు. కార్యక్రమంలో కురుపాం వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, విఎఎ, రైతులు పాల్గొన్నారు.

వీరఘట్టం: వరి పంటలో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె రాబర్ట్‌పాల్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో గ్రామీణ వ్యవసాయ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. ఎక్కువగా సేంద్రియ ఎరువులనే వాడేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు మండలంలోని చిట్టిపూడి వలసలో విత్తన అభివృద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాలకొండ ఎడిఎ కె.రత్నకుమారి, మండల వ్యవసాయ అధికారి జె.సౌజన్య, పలువురు విఎఎలు పాల్గొన్నారు.



రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

పత్తి, వరి పంటలో మేలైన వ్యవసాయ పద్ధతులు

పాచిపెంట : పత్తి, వరిపంటల్లో మేలైన వ్యవసాయ పద్ధతులను మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు రైతులకు అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పాచిపెంట, కోస్ట్ వలసలో సాగవుతున్న పత్తి, వరి పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాచిపెంటలో అధిక సాంద్రత పద్ధతిలో రైతు దండి రమణమూర్తి వేసిన పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంట గట్లపై కూరగాయలు, చుట్టూ ఆముదం, మొక్కజొన్న, బంతి మొక్కలతో పాటుగా అంతర పంటగా అపరాలు వేసి రసం పీల్చు పురుగుల నివారణకు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పచ్చ దోమ, తెల్ల దోమ, తామర పురుగులు ఉనికిని ఈ జిగురు అట్టల ద్వారా తెలుసుకొని, తద్వారా నివారణా చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. అంతేకాకుండా వేప కషాయం పిచికారీ ద్వారా కొరికి తినే పురుగుల గుడ్లను నివారించి పురుగు ఉధృతిని తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం కోస్టువలసలో వరిసాగును పరిశీలించారు. వరుసల్లో వరి నాట్లు వేసుకుని పాయలు తీసుకోవడం ద్వారా దోమపోటు ఉధృతిని చాలా వరకు తగ్గించుకోవచ్చని, గాలి, వెలుతురు ధారాళంగా ప్రవహించడం వల్ల ఎక్కువ పిలకలు వచ్చి దిగబడి పెరుగుతుందని అన్నారు. అంతేకాకుండా ఎరువులు వేసుకోవడం, కలుపు, పురుగు మందుల పిచికారీ సులువుగా ఉంటుందని తెలిపారు. రైతు సుతాపల్లి గోవిందరావు తన 40 ఎకరాల వరి పంటను పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన శిక్షణ పొందిన కూలీలతో వరుసల్లో వరి నాట్లు వేయించారు. కార్యక్రమంలో కోస్ట్ వలస సర్పంచి చెల్లూరు సీతారాం, విఎఎ వినోద్ కుమార్, విజయ్ పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బుడ్డిపేటలో పొలంబడిలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు భారతి ఎఒ అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చదరపు మీటరులో ఉన్న వరి కుదుల్లు 33 కుదుళ్ల, ఒక్కొక దుబ్బులో 15 నుంచి 20 పిలకలు ఉండాలని రైతులకు వివరించారు. అలాగే పొలబండి ఆవశ్యకతను వివరించారు. తక్కువ పెట్టుబడి నాణ్యమైన దిగుబడి సాధించడం, కాలిబాటలు తీయడం ద్వారా సుడి దోమ , గాలి, వెలుతురు, సూర్యరశ్మి అంది దిగుబడి సాధించడం, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ పదార్థాలతో చేసే వేపనూనె కషాయం, నీమస్త్రం,పుల్లటి మజ్జిగ, తుటీకాడ కషాయం,అగ్నిస్త్రం అటువంటి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని తెలిపారు. పొలంబడి ద్వారా పండించిన రైతుల ధాన్యాన్ని అధిక ధరలు విక్రయించి వారికి లాభాన్ని చేకూరుస్తుందని వివరించారు. ప్రతి రోజూ పొలంలో చేసే పనులను డైరీ రూపం లో పొందుపరుచుకోవాలని, ఏ సమయం లో ఎరువు వేశారు, ఏ సమయం లో పురుగుమందులు పిచికారి చేశారో, ఎప్పుడు మిగతా ఏమైనా మందులు వాడారో ప్రతిరోజూ డైరీ లో పొందు పరుచుకోవాలని సూచించారు. విఎఎ పి.లక్ష్మణ్, బి.సుధీర్ పాల్గొన్నారు.

పరీక్షా ఏర్పాట్లను పరిశీలిస్తున్న పిఒ రమణ



డిఎస్‌సి ఎంపిక పరీక్షకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసి వద్ద గురువారం ఉదయం 11 గంటలకు డిఎస్‌సి ఉచిత కోచింగ్‌కు ఎంపిక పరీక్ష జరుగుతుందని ఐటిడిఎ పిఒ వివి రమణ తెలిపారు. పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులకు తాగునీటి సదుపాయం కల్పించాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, డిడిలు అన్నదొర, రుక్మంగదయ్య, డిప్యూటీఇఒ నారాయడు, ఎఎంఒ కోటిబాబు, జిసిటిఒ రాములమ్మ, హెచ్ఎం సూర్యనారాయణ తదితరలు పాల్గొన్నారు.

జిసిసి టెండర్లు

స్థానిక ఐటిడిఎ పరిధిలోగల గురుకుల పాఠశాలలకు కూరగాయలు, పండ్లు సరఫరాకు టెండర్లు నిర్వహిస్తున్నట్టు ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ వివి రమణ అన్నారు. కూరగాయలు, పండ్లు సరఫరాలో నాణ్యత పాటించాలన్నారు. టెండర్లలో ఫైనల్ అయిన ధరకే సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, జిసిసి మేనేజర్లు దాసరి కృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జెన్పాక్ట్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జన్పాక్ట్ ఎంఎన్‌సి కంపెనీలో ఉద్యోగాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెన్పాక్ట్ ఎంఎన్సి కంపెనీలో కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్ వాయిస్ సపోర్ట్ విభాగాలలో 1500 ఖాళీల భర్తీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. ఈ ఉద్యోగాలకు బీటెక్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన, 2022, 2023, 2024 సంవత్సరాల్లో పాసైన అభ్యర్థులు అర్హులు, ఎంపిక ప్రక్రియలో హెచ్‌ఆర్, టెక్నికల్ రౌండ్లు ఉంటాయి. ఈ ఉద్యోగాలు హైదరాబాద్లోని హఫీజ్పేట్లో రొటేషన్ షిఫ్టుల్లో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు 28 ఆగస్టు 2024 లోపల తమ దరఖాస్తులు సమర్పించాలని కోరడమైనది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే వారు, వెంటనే https://bit.ly/46Wzaz లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీ, స్థలాన్ని తర్వాత తెలియజేయడం జరుగుతుంది. మరింత సమాచారం కోసం 6301275511, 9494777553 నంబర్ను సంప్రదించగలరని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రకటనలో తెలిపారు.

'పిఎం జన్‌మాన్' ద్వారా గిరిజనులకు లబ్ధి

ప్రజాశక్తి - సీతంపేట



విద్యార్థులతో ముచ్చటిస్తున్న పిఒ

మండలంలోని దిబ్బగూడకు ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ వివి రమణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిఎం జన్ మాన్ పథకం ద్వారా గిరిజనులకు అందుతున్న సేవలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో అందరికీ రేషన్ కార్డులు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకొన్నారు. తాగునీరు సదుపాయం, గృహ నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం వంటి అంశాలపై వివరాలు తెలుసుకొన్నారు. పిఎం జన్‌మాన్ ద్వారా వచ్చే పథకాల లబ్ది అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

మండలంలోని చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ పిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. వారి విద్యా సామర్థ్యాన్ని అడిగి తెలుసుకొన్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని అన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వార్డెన్‌కు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, ఇఇ సింహాచలం, డిఇ, సచివాలయ సిబ్బంది, డిప్యూటీ వార్డెన్ రామకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులు పరిశీలన

భామిని : భామినిలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాలను సీతంపేట ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ వివి రమణ బుధవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ నెలాఖరుకు ఏకలవ్య పాఠశాలలో అన్ని విభాగ పనులు తుది దశకు చేరాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్‌శాఖ ఇఇ సింహాచలం, ఎపిఒ చినబాబు, భామిని ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి -గరుగుబిల్లి: మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడేరు. ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలలో గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల ను, వాటి వివరాలను పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ఫ్లెక్సీ లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామ పంచాయి తీ గ్రామసభ, వార్డు సభల సిఫార్సు లను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేయడం జరుగుతుం దన్నారు. గ్రామసభల్లో పలు పథకాలకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు, పనులకు ప్రతిపాద నలు స్వీకరించడం జరుగుతుం దన్నారు. గ్రామ సభల నిర్వహణలో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా వేతనాలు పొందేవారి హక్కులు, అర్హతలపై అవగాహన కార్యక్ర మాలు నిర్వహించనున్నామన్నా రు. ఇప్పటికే మంజూరు చేసిన, పురోగతిలో ఉన్న పనులను గ్రామ సభల్లో చదివి ప్రజలకు వివరించడం జరుగుతుదన్నారు. 2024-25 సంబంధించి కొత్త పనులు గుర్తించి వాటి అమలు కొరకు ప్రతిపాద నలు సిద్ధం చేయడం జరుగుతుందని, సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచడం కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ అనుబంధ పనులను గుర్తించి చేపట్టడం జరుగుతుంద న్నారు. కొత్తగా ఫీడర్ కాలువ నిర్మించుటకు, కొత్త పంట కాలువల నిర్మాణం, పొలం గట్లపై మొక్కల పెంపకంపై అవగాహన, రైతుల భూముల్లో ఫార్మ్ పాండ్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. రైతులు భూముల సరిహద్దు కందకాలు నిర్మించుట, వ్యక్తిగత భూములలో వ్యవసాయ బావులు నిర్మాణం చేపట్టేందుకు పండ్ల తోటల్లో భూసార సంరక్షణ కందకాలు త్రవ్వడం, రైతుల భూము లలో గడ్డి పెంపకం వంటి అంశాల ను గ్రామ సభల్లో గుర్తించడం జరుగుతుందన్నారు. పశువుల షెడ్ల నిర్మాణం, గొర్రెల షెడ్ల నిర్మాణంకు ప్రతిపాదనలు స్వీకరించడం జరుగు తుందని ఎంపీడీవో పైడితల్లి పేర్కొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ జగన్మోహనరావు

వెల్నెస్ కేంద్రాల ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

హెల్త్, వెల్నెస్ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. చినబొండపల్లి, ఎంఆర్ నగరంలో వెల్నెస్ కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు కేంద్రంలో వైద్య సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతి రోజూ ఎంతమందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు తదితర వివరాలను రికార్డులో పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరును గమనించారు. చికిత్సా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం ఏ మేరకు మెరుగు పడుతుందో, ప్రతి రోజూ మందులు వేసుకుంటున్నారోని వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వీరి హిమోగ్లోబిన్ శాతం తగ్గుముఖం పడకుండా పర్యవేక్షించాలన్నారు. సీజనల్ జ్వరాలు గుర్తిస్తే అక్కడే నిర్ధారణ పరీక్షలు జరిపి మందులు అందజేయాలన్నారు. వైద్యారోగ్య శాఖ అందజేసిన పలు ఆరోగ్య సూచనలు తెలియజేసే గోడ, కరపత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలు వైద్యానికి దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాసపడకుండా వెల్నెస్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలు వినియోగించుకోవాలని డాక్టర్ జగన్మోహన్ సూచించారు. ఆయన వెంట డెమో యోగీశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - కురుపాం



మొక్కలు నాటుతున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కెవికె సమన్వయకర్త ధ్రువ అన్నారు. బుధవారం రస్తాకుంటుబాయి కెవికె ఆవరణలో ఏక్పెడ్ మాకినాం కార్యక్రమంలో భాగంగా 40 రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ నిమిత్తమై ప్రకృతిలో జరిగే మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తమవంతుగా వాతావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు ఎస్. శ్రీనివాసరాజు, అనంతవిహారి, స్రవంతి, సిబ్బంది హరీష్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖపై ఎమ్మెల్యే ఆగ్రహం

సమావేశానికి గైర్హాజరైన అధికారులకు, వైద్యులకు మెమోలు

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలతో గిరిజనులు బాధపడుతున్నారని, విద్యాసంస్థల్లోనూ, గ్రామాల్లో మలేరియా మరణాలు జరుగుతున్నప్పటికీ వైద్య శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆగ్రహం మండిపడ్డారు. స్థానిక వైటిసిలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బి.ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎక్కువగా ఆసుపత్రి నుండి రెఫర్లు జరుగుతున్నాయన్నారు. మండల సమావేశానికి గైరాజరైన వైద్యులకు, అధికారులకు మెమో జారీ చేయాలని ఎంపిడిఒ గీతాంజలి ఆదేశించారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ 23న గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ప్రజా ప్రతినిధులు అవసరమైన పనులు గుర్తించి గ్రామసభలో తీర్మానించాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అంగన్వాడీ భవనాలు నిర్మించాలని ప్రతి సమావేశంలో అడుగుతున్నా పట్టించుకోవడంలేదని ధారపాడు సర్పంచ్ జీలకర్ర సుందరమ్మ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. శంభాం సర్పంచ్ తిరుపతిరావు ఆర్‌బికెల్లో అగ్రికల్చర్ సిబ్బంది అందుబాటులో లేరన్నారు. ఎంపిపి ఆదినారాయణ మాట్లాడుతూ డిఎపి ఎరువులు రావడంలేదన్నారు. సమావేశంలో జడ్పిటిసి లక్ష్మి, జిల్లా కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, సూపరింటెండెంట్ మానస, డిఇలు కృష్ణ కుమార్, ఢిల్లీ రావు, సిడిపిఒ శాంతి, భవాని, వైద్యాధికారి సాయి చరణ్, డిటి నాగేంద్ర ప్రసాద్, ఎపిఒ సాగర్, పలువురు ఎంపిటి సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులను సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ



సాలూరులో ఆందోళన చేస్తున్న మాలమహానాడు నాయకులు

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించిన భారత్ బంద్‌లో భాగంగా స్థానిక మాలమహానాడు నాయకులు కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముగడ గంగమ్మ, కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు, రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర నాయకులు గొంప ప్రకాశరావు ఆధ్వర్యాన మాలలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బంద్ కారణంగా పట్టణంలోని పలు ప్రయివేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ బ్యాంకులు మూతపడ్డాయి. ఆర్టీసి బస్సులు యథావిధిగా తిరిగాయి. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

వీరఘట్టం : బుధవారం ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండలంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు అంటూ నినాదాలు చేశారు. బంద్ కార్యక్రమం చేపట్టడంతో పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో ఎ.వెంకటరావు, జంపు ఉమామహేశ్వర రావు, చంద్రశేఖర్, డి అనంతు, ఎ.సూర్యనారాయణ ,డి ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు